నమస్తే తెలంగాణ
# వరంగల్
10 | వరంగల్, గురువారం 13 మార్చి 2025 | WARANGAL



అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభం కాగా, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి హాజరైన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# మడి పారదు.. పంట పండదు

## సాగునీటి కోసం తండ్లాడుతున్న అన్నదాతలు

- పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు
- అప్పులు చేసి బోర్లు వేస్తున్నా ఫలితం శూన్యం
- రెండు తడులు పారితే చేతికొచ్చేదంటున్న రైతులు

*'చెరువులు, కుంటలు ఎండిపోయినయ్.. వాగులు, చెక్‌డ్యాముల్లో చుక్క నీరు లేదు. భూగర్భ జలాలు పడిపోయినయ్.. బావులు అడుగంటినయ్.. బోర్లు పోస్తలేవు.. రెండు తడులు పారితే చేతికొచ్చే పంట సాగు నీరు లేక కళ్లముందే తెర్లవుతున్నది. ఎస్సారెస్పీ, దేవాదుల కాల్వలల్ల నీళ్లొస్తయన్న ఆశతోటి యాసంగిలో వరి, మక్కజొన్న, ఇతర పంటలు సాగు చేసినం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కరువును తీసుకొచ్చింది. నీళ్లున్నా పంటలకు వదలక మమ్ములను అరిగోస పెడుతున్నది' అంటూ రైతులు రాష్ట్ర సర్కారుపై మండిపడుతున్నారు. ఎండిపోతున్న పంటలు కాపాడుకునేందుకు తండ్లాడుతున్నరు. వాగుల్లో జేసీబీలతో చెలిమలు తోడడం, బావుల్లో పూడిక తీయడం చేస్తున్నారు. అయితే ఇన్ని పాట్లు పడి నీరు పారిద్దామంటే విద్యుత్ కష్టాలు మరింత ఇబ్బంది పెడుతున్నాయని, ఒక్క మడి పారకముందే కరెంట్ పోతున్నదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సగం పంట పోతే పశువుల మేతకు వదిలిపెట్టామని, మరో పదిరోజులు ఇదే పరిస్థితి ఉంటే మొత్తం ఎండుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత కష్టపడినప్పటికీ చివరికి పంట చేతికొస్తుందో.. లేదోనని, పెట్టిన పెట్టుబడి తిరిగొస్తుందో.. రాదోనని ఆందోళన చెందుతున్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క గుంట కూడా పంట ఎండలేదని గుర్తుచేసుకుంటున్నరు. అప్పుడు కాంగ్రెస్ మాటలకు ఆశపడి.. ఇప్పుడు గోసపడుతున్నామని బోరుమంటున్నారు.*

*-నమస్తే నెట్‌వర్క్, మార్చి 12*



మానేరు వాగు పక్కన ఫిల్టర్ వేయిస్తున్న రైతు

### రూ. లక్షతో ఫిల్టర్ వేస్తున్న..



మల్హర్ : గత 15 ఏళ్లుగా మానేరు పరీవాహక ప్రాంతంలో ఐదెకరాల పొలం సాగు చేస్తున్న. గత పదేళ్ల నుంచి సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర నుంచి పంటలకు నీటి తిప్పలు తప్పడం లేదు. గతంలో మానేరు పక్కన 40 ఫీట్ల ఫిల్టర్ వేస్తే నా పొలానికి పుష్కలంగా నీరందేది. ఇప్పుడు దానిలో నీరు లేక పక్కనే రూ. లక్ష ఖర్చు చేసి 100 ఫీట్ల లోతుతో మరో ఫిల్టర్ వేస్తున్న. అయినా నీరు పడుతుందో.. లేదో.. అని ఆందోళనగా ఉంది. చెరువులు, కాల్వలు, వాగులు ఎండిపోయి పంటలు సాగు చేసే పరిస్థితి పోయింది. మళ్లీ పదేళ్లు వెనక్కి వెళ్లినట్టు తయారైంది. రైతులకు మళ్లీ కన్నీరే మిగిలింది. మా కోసం కాదు.. పంటల కోసం నీరివ్వాలని వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు.

– మాచర్ల మధు, రైతు, తాడిచర్ల



### వరి పంటకు ట్యాంకర్‌తో నీరు..

జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన ఈ రైతు పేరు చల్ల మల్లారెడ్డి. ఏటా యాసంగిలో ఐదెకరాల్లో వరి పంట సాగుచేసేవాడు. ఈసారి పరిస్థితిని ముందే గమనించి మూడు ఎకరాల్లోనే వరి నాటు వేశాడు. తనకు బావితోపాటు బోరు అడుగంటడంతో పంటకు సరిపడా నీరందడం లేదు. దీంతో పంటను కాపాడుకునేందుకు రెండు రోజులకోసారి రూ. 500 చెల్లిస్తూ ఆరు ట్యాంకర్ల నీటిని వరి పంటకు అందిస్తున్నాడు.

*– లింగాలఘనపురం, మార్చి 12*



నీరు లేక ఎండిపోతున్న వరి పంటలో పశువులను మేపుతున్న రైతు మూడ శ్రీను



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో ఎండిపోయిన కుమ్మరికుంట

### 12 ఎకరాలు పశువులకు వదిలిన..

మరిపెడ : వ్యవసాయ పెట్టుబడి కోసం బంగారంను బ్యాంక్‌లో పెట్టి రూ. 3 లక్షలు తీసుకున్న. మరో రూ. 2లక్షలు అప్పు తీసుకొచ్చి నాకున్న 3 ఎకరాలకు తోడు 24 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగుచేసిన. 7 బావులు, 2 బోర్లు, ఆకేరు వాగులో మూడు మోటర్ల సాయంతో సాగునీరందిస్తున్న. రోజు రోజుకు ఎండలు తీవ్రం కావడంలో భూగర్భ జలాలు అడుగంటాయి. బావిలో నీరు ఇంకిపోవడంతో పూడికతీసినా ఫలితం లేకపోవడంతో 12 ఎకరాల వరి పంటను పశువుల మేతకు వదిలిపెట్టిన. వానకాలంలో ఆకేరు వాగులో వచ్చిన వరదలతో పంట పొలాలు మొత్తం కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయాం. వాగులో చెక్ డ్యాంలన్నీ తెగిపోవడంతో నీళ్లు నిల్వ లేకుండా పోవడం, యాసంగి పంటకు నీరందక పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా ఆకేరువాగులోకి ఎస్సారెస్పీ జలాలు వదిలి పంటలను కాపాడాలి.

– మూడ శ్రీను, కౌలు రైతు, సీతారాంతండా, మరిపెడ మండలం



ఎల్కతుర్తి శివారులో నీళ్లు రాని కాల్వను చూపిస్తున్న రైతులు

### తుంట దించి.. మొద్దు ఎత్తుకున్నం



దేవరుప్పుల : పదేండ్లు కేసీఆర్ సారు చేసిండు గదా.. రేవంత్‌రెడ్డి బాగా మాట్లాడుతుండని ఒక్కసారి ఓటేసి చూద్దామనుకున్నం. ఇంత గందరగోళం అయితదనుకోలే. రైతుల ఎంబడే పడ్డడు. రుణ మాఫీ లేదు. రైతు భరోసా పడుతలేదు. 3 ఎకరాలు నాటు పెడితే బోర్లు పోయక మొత్తం ఎండిపోయింది. ఏది చూసినా కరువే. ఇన్ని నీళ్లొదులుతె రైతులు బాగుపడుతరుకదా. దయాకర్‌రావు ఉంటే ఇట్ల చెప్పితే అట్ల నీళ్లు వచ్చేది. ఒద్దంటే కాల్వలు పారేది. ఇంత కరువు పదేండ్లలో ఎన్నడు చూడలే. అడిగేటోడు లేడు. తుంట దించి మొద్దు ఎత్తుకున్నట్లు ఉంది మా పరిస్థితి.

–గుగులోత్ తేజ్యా, రైతు, పెద్దతండా

### పక్కనే మల్లన్న గండి ఉన్నా.. పంట ఎండింది

చిల్పూరు : మాది జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఫతేపూర్ గ్రామ శివారులోని బొండబడ్డ తండా. నాకున్న 3 ఎకరాల వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేస్తే మొత్తం ఎండిపోతున్నది. మాకు కూతవేటు దూరంలో మల్లన్నగండి రిజర్వాయర్ ఉన్నా కనీసం చెరువులకు నీరు వదలడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడూ చెరువులు ఎండలేదు. కంటి రెప్ప కొట్టినంత సేపు కరెంట్ పోలేదు. సాగు నీరిచ్చి పంటలు కాపాడాలని ఎమ్మెల్యేను అడిగితే వచ్చే వానకాలం వరకు ఇస్తానన్నడు.

*– బానోత్ శశిరామ్, రైతు, బొండబడ్డ తండా, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం*

### ఏడు బోర్లు ఏసినా నీరు పడలే..

బచ్చన్నపేట : మాది జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్న రామన్‌చర్ల పరిధి మొండికుంట. మాకున్న 11 ఎకరాల్లో వరి పంట సాగు చేసినం. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోస్తలేవు. దీంతో నీరందక పంటంతా ఎండిపోయింది. సాగు కోసం రూ. 2.50 లక్షల పెట్టుబడి పెట్టిన. పంటను కాపాడుకునేందుకు రూ. 4.50 లక్షలు అప్పులు తెచ్చి ఏడు బోర్లు ఏసినం. ఒక్కదాంట్లో కూడా నీరు పడకపోవడంతో పంటంతా పశువులకు మేతగా మారింది. గత సీజన్‌లో చేతికొచ్చే సమయంలో వడగళ్లు పడడంతో పంటంతా నేలపాలైంది. ఒక్క ఎకరానికి కూడా పరిహారం రాలేదు. గత ప్రభుత్వం తొమ్మిదేళ్లు సమృద్ధిగా సాగునీరివ్వడంతో పంటలు బాగా పండించినం. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపితే మాకు ఇబ్బంది కలిగేది కాదు. కళ్ల ముందే ఇన్ని ఎకరాల పంట ఎండిపోతుంటే ఏం చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం నీళ్లు విడుదల చేసి పంటలు కాపాడాలే.

*– మల్ల లక్ష్మి, మహిళా రైతు, మొండికుంట, బచ్చన్నపేట మండలం*





ఎండిన వరి పంటలో పశువులను మేపుతున్న బానోత్ శశిరామ్

# ఉద్యమ ద్రోహులు రేవంత్, నాయిని

- మోదీ కోవర్టు సీఎం రేవంత్‌రెడ్డి
- రాజేందర్‌రెడ్డీ చిల్లర మాటలు మానుకో
- హరీశ్‌రావుపై విమర్శలు సిగ్గుచేటు
- ఓరుగల్లు వేదికగా 25 ఏండ్ల పండగ
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పక్కన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 12 : బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగకు ఓరుగల్లు వేదిక కావడం ఆనందంగా ఉన్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్‌ది ప్రత్యేక స్థానమని, కేసీఆర్ లేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేమన్నారు. మోదీ కోవర్టు సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. ఉద్యమ సమయంలో నీ చేతిలో, నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో పిస్టల్, రైఫిల్ ఉన్నదన్న విషయం మర్చిపోవద్దన్నారు. ఉద్యమ నేత కేసీఆర్ ఉద్యమించకపోతే నువ్వు ఎమ్మెల్యే, రేవంత్‌రెడ్డికి సీఎం పదవులు వచ్చేవా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను విమర్శించే స్థామి మీది కాదన్నారు. మీరిద్దరు కూడా ఉద్యమ సమయంలో ఉద్యమ ద్రోహులకు సద్దులు కట్టి ద్రోహం చేయడంతో పాటు ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసిన సంఘటనను తెలంగాణ సమాజం మరచిపోదన్నారు. మానుకోట ఘటన జరిగినప్పుడు మీరిద్దరు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ప్రపంచమే అబ్బురపోయేలా సభలు సమావేశాలు నిర్వహించిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. చిల్లర మాటలు మాట్లాడటం రాజకీయాల్లో మంచిది కాదని నాయినికి హితవు చెప్పారు. 25 ఏండ్ల పండుగ జరుపుకొంటున్న వేళ విమర్శలు చేయడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. ప్రతి సారి అభివృద్ధి గురించి మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి నగరాన్ని నువ్వేదో నిర్మించినట్లు మరో చంద్రబాబులా మాట్లాడుతున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితితో మీ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేక పోతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల్లోనే తీవ్రమైన వ్యతిరేకత కాంగ్రెస్‌పై వస్తోందన్నారు. నిర్మించిన ప్రాజెక్టులకు రూ.5 కోట్ల నిర్వహణ నిధులు విడుదల చేయలేని అసమర్థులు మీ మంత్రులని ఆయన ఎద్దేవా చేశారు. దేవాదుల ప్రాజెక్టు పడకేసింది.. జనగామ ఎండిపోతోంది, డోర్నకల్, భూపాలపల్లిలో పచ్చని పైరులు ఎండిపోతూ పశుగ్రాసంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ కలిసి ఒక చోట కూర్చొని మాట్లాడుకోలేని మీరు కూడా మా పార్టీ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ 15 నెలల్లో చేసిన అవినీతిపై కేసులు కోర్టుల్లో నడుస్తున్నాయని, హైకోర్టులు నోటీసులు ఇస్తే కూడా సమాధానం లేదని, మంత్రులు ధాన్యం కొనుగోళ్లలో అవినీతి సొమ్ము వాటాలపై కేసులు కూడా నడుస్తున్నాయని విమర్శించారు. నాడు బీఆర్ఎస్ హయాం లో కేటీఆర్ నాయకత్వంలో ఏడాదిలో రూ.1,250 కోట్ల ఆదాయం వస్తే, నేడు ఇసుక మేటల్లో కాంగ్రెస్ నాయకుల వాటాలతో ఆదాయం 150 నుంచి 200 కోట్లు దాటడం లేదన్నారు. హరీశ్‌రావు ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నాయకుల గురించి పల్లెత్తు మాట అనలేదు.. ఉలికపడకు రాజేందర్‌రెడ్డి.. మార్పు కోణంలో నువ్వు గెలిచావు.. కానీ ప్రజలు ఇప్పుడు తలలు పట్టుకుట్టున్నారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో 25 ఏండ్ల పార్టీ పండుగను వరంగల్ కేంద్రంగా గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నాయకులందరం కలిసి పనిచేసి సభను విజయవంతం చేస్తామని పెద్ది అన్నారు.

### ఉద్యమంలో ఉమ్మడి జిల్లాది ముఖ్య భూమిక

**– మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

స్వరాష్ట్ర ఉద్యమంలో ఉమ్మడి జిల్లా ముఖ్య భూమిక పోషించింది. వరంగల్ జిల్లాను అభాసుపాలు చేసేందుకు కొందరు నాయకులు బయలుదేరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి 16 నెలల బాలుడని, ప్రపంచమంతా తెలుసు, ఈ నగరం గురించి నాకు తెలిసినంతగా ఎవరికీ తెల్వదని ఎక్కువ ఊహించుకుంటున్నాడు. ప్రజలు శాసన సభ్యుడిగా అవకాశం ఇచ్చారు సమస్యలపై దృష్టిపెట్టు. మున్సిపాలిటీలో అవినీతి ఎక్కువైందని అంటున్నావు.. నీ నియోజకవర్గం కూడా మున్సిపాలిటీలో ఉంది. అంటే మీ పని విధానాన్ని, తార్కానం నువ్వే ఒప్పుకున్నావు. అవినీతి జరుగుతుందని నీవే చెబుతున్నావు. రాసిపెట్టుకో.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ నాయకుడు నయీమొద్దీన్, రవీందర్‌రావు, జానకీరాములు, రఘు, వెంకన్న, రామ్మూర్తి పాల్గొన్నారు.

# ప్రణాళిక లేకే ఎండుతున్న పంటలు

- దేవాదుల, ఎస్సారెస్పీ నీటిని వదిలితే ఈ పరిస్థితి వచ్చేది కాదు
- సీఎం రేవంత్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్టు అప్రజాస్వామికం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల/పాలకుర్తి, మార్చి 12: ప్రభుత్వం వద్ద యాసంగి సాగునీటి ప్రణాళిక లేకపోవడం వల్లే పంటలు ఎండుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పెండింగ్ బిల్లుల కోసం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేయడంతో బుధవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారికి మద్దతు ప్రకటించారు. అదేవిధంగా దేవరుప్పులలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాసంగికి ముందే కాళేశ్వరం, దేవాదుల నీటిని పంపింగ్ చేసి రిజర్వాయర్ల ద్వారా నీటిని వదిలి చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నింపేదన్నారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి 24 గంటల కరెంట్‌తో బోర్లు పోయడంతో ఒక్క ఎకరం ఎండకుండా రైతులు పదేళ్లు పంటలు పండించారన్నారు. ఈ ప్రణాళిక కొరవడడం వల్లనే పంటలు పూర్తిగా ఎండాయని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. గత పదేళ్లుగా ఆర్థిక సమృద్ధిని సాధించిన రైతులు నేడు పదేళ్లు వెనక్కి వెళ్లే దుస్థితి వచ్చిందన్నారు. పంటల పెట్టుబడి, వేసిన కొత్త బోర్లు వెరసి ఒక్కో రైతు రూ. లక్షల్లో నష్టపోయాడని, వారికి నష్టపరిహారం చెల్లిస్తారా.. అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. పాలకుర్తి నియోజకవర్గంలో సాగునీటి కరువు ఉందని, బోర్లు పోయక వరి, మక్కజొన్న, మిరప పంటలు ఎండాయన్నారు. ముందస్తుగా ఇటు దేవాదు ల, అటు ఎస్సారెస్పీ నీటిని వదిలితే రైతులు బాగుపడేవారన్నారు. పంటలు వేసి చేతికొచ్చే సమ యంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి రైతులు పంటలు వేయొద్దని, భూగర్భ జలాలు లేవని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అదేదో మొదలే చెబితే రైతులు యా సంగి పంటలు వేయకుండా ఉండేవారన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన ఈ సర్కారుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోవడం ఖాయమని జోస్యం చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతున్నద ని ఎర్రబెల్లి అన్నారు. 14నెలలు గడిచినా మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకపోవడం దారుణ మని, ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతున్నదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంలో పించిందని, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, నర్సరీలు, చెట్లు ఎండిపో తున్నాయన్నారు. కార్మికులకు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, జీపీ ట్రాక్టర్లు నడపలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీళ్లు లేక గ్రామాల్లో నీటి కొరత ఏర్పడిందని, దేవాదుల నీళ్లు రాక పంట పొలాలు ఎండుతున్నాయన్నారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డి బుద్ధి మార్చుకోవాలని సూచించారు. 14 నెలలుగా కేంద్రం నుంచి రూపాయి రావడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలంటే ప్రభుత్వం భయపడుతున్నదని, బడా కాంట్రాక్టర్లు, కమిషన్లపై ఉన్న చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచ్ లపై లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వస్తున్నదన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతు పెరుగుతున్నదని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, ఆయన నాయకత్వాన్ని ప్రజలు కోరు కుంటున్నారని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధగాని కర్ణాకర్, రామ్మోహన్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, మాజీ సర్పంచ్‌లు కల్వల భాస్కర్‌రెడ్డి, పుస్కూరి కళింగరావు, ఇమ్మడిప్రకాశ్, నకీర్త యాక య్య, ఆనపర్తి శాంతయ్య, కోల రమేశ్, లక్ష్మణ్, బానోత్ మహేందర్, యాకూబ్, ధరావత్ దేవా, బాలూనాయక్, లకావత్ సురేశ్, ఎడవెల్లి కృష్ణ పాల్గొన్నారు.